క్లుప్తంగా

హుండీ లెక్కింపు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీవిజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.4.69 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ రజనీకుమారి తెలిపారు.

శానిటేషన్ అధ్వానం

ఇల్లెందు: పట్టణంలోని 5వ వార్డులో పేరుకపోయిన సమస్యలను పరిష్కరించాలని అక్కడి మాజీ కౌన్సిలర్ యలమందల వాసు ఆధ్వర్యంలో మంగళవారం కమిషనర్ శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్డు నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మూడు తాగునీటి చేతి పంపులకు ప్లాట్‌ఫాంలు నిర్మాణం చేయాలని కుక్కలు, కోతులు విపరీతంగా సంచరిస్తున్నాయని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

ఇల్లెందురూరల్: చల్లసముద్రం ఉన్నత పాఠశాలలో 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన నిజాంపేట గ్రామ వాసి మాడె రాము ప్రస్తుతం మణుగూరులో ఉద్యోగం చేస్తున్నాడు. అతను ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పదోతరగతి బ్యాచ్ స్నేహితులు మంగళవారం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు/టేకులపల్లి: వృత్తి శిక్షణ ఉచిత కోర్సులు నేర్చుకునే వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన మహిళలు టైలరింగ్, మగ్గం, బ్యుటీషియన్ కోర్సులలో శిక్షణ పొందేందుకు 16లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రమేష్

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీకాలనీకి చెందిన మాజీ సర్పంచ్ గద్దల రమేష్‌ను టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమేష్‌ను పీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, కోనేరు సత్యనారాయణ శాలువలతో సత్కరించారు.

సంతాపం



నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: పడమటనర్సాపురం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఇంగలపూడి శ్రీనివాసరావు భార్య వెంకటరమణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె భౌతికాయాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్రకుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు సందర్శించారు. ఆమె భౌతికాయంపై పార్టీ జెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో లకావత్ రెడ్డి, సీలంనేని వెంకటేశ్వరరావు, తెల్లబోయిన విశ్వనాథ్, గుగులోత్ కీర్యా, వెంకటేశ్వర్లు, పుల్లూరి ముత్తిలింగం, పోసాల శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

నిధులు రెడీ.. | టెండర్ ప్రశ్నార్థకం

- ఇల్లెందులోని 24వార్డుల్లో 56 పనులు
- పనులు మొదలు పెట్టేదెప్పుడో..
- రూ.15 కోట్లతో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు



బ్రిడ్జి నిర్మించాల్సిన సత్యనారాయణపురం వద్ద లోలెవల్ కాజ్‌వే (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు పట్టణాభివృద్ధికి నిధులు ఉన్నాయి.. కానీ టెండర్ నిలిచిపోయింది. మున్సిపాలిటీలో 24 వార్డుల్లో 56 పనులకు ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.15 కోట్లు రెడీగా ఉన్నాయి. 1 నుంచి 24 వార్డులకు ప్రతీ వార్డుకు ఒకటి నుంచి నాలుగు వరకు అభివృద్ధి పనులు కేటాయించారు. ముఖ్యంగా సత్యనారాయణపురంకు వెళ్లే రహదారిలో అలుగు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం సమస్య తీరనుంది. ఇందుకోసం రూ.70 లక్షలు కేటాయించారు. వర్షాలు పడినప్పుడు చెరువు నిండిందంటే అలుగు వాగు పొంగి ప్రవహిస్తుంది. దీంతో సత్యనారాయణపురం వెళ్లాలంటే వాగు దాటే పరిస్థితి ఉండదు. గతేడాది ఈ వాగు దాటుతూ ఓ యువకుడు బైక్‌తో సహా కొట్టుకుపోయిన విషయం విదితమే. అయితే నిధులు రెడీగా ఉన్నా టెండర్‌కు మాత్రం నోచుకోవడం లేదు. మున్సిపల్ సీడీఎంఏ నుంచి టెండర్ ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్లు లేఖ కూడా మున్సిపల్ కార్యాలయానికి చేరింది. టెండర్ జాప్యం కారణంగా అభివృద్ధి అడుగు ముందుకు పడటం లేదు. ఇక ఇల్లెందులపాడులో అలుగు వాగు మీదుగా వైకుంఠధామానికి వెళ్లేందుకు లోలెవల్ కాజ్‌వే కూలిపోయింది. దీని స్థానంలో మరో బ్రిడ్జి నిర్మాణం కోసం కూడా రూ.35 లక్షలు నిధులు కేటాయించారు. టెండర్ జాప్యం కారణంగా పనులు ముందుకు సాగటం లేదు. ఇక ఎల్‌బీఎస్ నగర్ నుంచి నంబర్ టూ బస్తీకి వెళ్లే మార్గంలో సుందర్‌లాల్ ఇంటి వద్ద హైలెవల్ బ్రిడ్జి కోసం రూ.1.30 కోట్లు నిధులు కేటాయించారు. ఈ నిధులకు కూడా గ్రహణం పట్టింది. వీటితో పాటు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు. 9వ వార్డులో రూ.25 లక్షలు పార్క్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇక 1వ వార్డులో డ్రెయినేజీలకు రూ.38 లక్షలు, 2వ వార్డులో డ్రెయినేజీకి రూ.35 లక్షలు, 3వ వార్డులో రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, 4వ వార్డులో రూ.30 లక్షలు, 6వ వార్డులో రూ.24 లక్షలు, 7వ వార్డులో రూ.34 లక్షలు, 8వ వార్డులో రూ.20 లక్షలు, 10వ వార్డులో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, 11వ వార్డులో రూ.25 లక్షలు, 13వ వార్డులో రూ.50 లక్షలు, 16వ వార్డులో రూ.86 లక్షలు, 18వ వార్డులో రూ.46 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, 20వ వార్డులో రూ.40 లక్షలతో రిటైయినింగ్ వాల్‌కు నిధులు కేటాయించారు. ఇలా 24వార్డుల్లో రూ.15 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని 56 పనులను నిర్ణయించారు. టెండర్ జరిగితే పనులు ప్రారంభం కానున్నాయి.



బుగ్గువాగు మీద బ్రిడ్జి నిర్మించనున్న లోలెవల్ కాజ్‌వే

టెండర్ వేగవంతం చేయాలి..



మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయితే వార్డులో సమస్యలు పరిష్కారం అవుతాయి. ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల అవసరం ఉంది.

– చాంద్ పాషా, ఇల్లెందు

త్వరలో టెండర్లు..



మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కేటాయించిన రూ.15 కోట్ల ప్రత్యేక నిధులకు త్వరలో టెండర్ జరుగుతుంది. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే అగ్రిమెంట్ చేసి పనులు వెంటనే ప్రారంభిస్తాం. ప్రస్తుతం కేటాయింపులపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తున్నాము. – మురళీ, డీఈ, మున్సిపాలిటీ, ఇల్లెందు

నిధులు విడుదల చేయండి..



ఖమ్మం కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్‌ను కలిసి నియోజవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం పలు ప్రతిపాదనల నివేదికను అందజేశారు. ముఖ్యంగా ఇల్లెందు నియోజకవర్గంలో అంతర్భాగంగా ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న కామేపల్లి మండల పింజరమడుగు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ముచ్చర్ల డబుల్ బెడ్ రూం ఇళ్లు పూర్తి చేసేందుకు రూ.35 లక్షలు నిధులు విడుదల చేయాలని రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే ఆ నిధుల ప్రతిపాదనలను కలెక్టర్ అనుదీప్‌కు అందజేశారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

సుజాతనగర్: కొత్తగూడెం రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సుజాతనగర్ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల కోర్టును బుధవారం ఏర్పాటు చేసినట్లు సుజాతనగర్ విద్యుత్ శాఖ ఏఈ కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, కొత్త సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకం కంటే హెచ్చు మొత్తంలో బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీసు రద్దు తదితర అంశాలపై జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ, సుజాతనగర్ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు, రైతుల నుంచి రాతపూర్వక ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

కేటీపీఎస్ 8వ దశ నివేదిక పంపించండి..



సీఈ ప్రభాకర్‌రావుతో నాయకులు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ 8వ దశ కర్మాగారం నిర్మాణానికి సంబంధించి సాధ్యాసాధ్యాలకు సంబంధించిన నివేదికను కేంద్రానికి, బోర్డుకు త్వరితగతిన పంపించాలని కేటీపీఎస్ 8వ దశ సాధన సమితి నాయకులు సీతారాంరెడ్డి, మంగీలాల్ కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్లను కోరారు.

స్థానిక కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలో మంగళవారం సీఈలు ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబులను వేర్వేరుగా కలిసి చర్చించారు.

కేటీపీఎస్ 8వ దశ సాధన సమితి కృషి ఫలితంగా టీజీ జెన్కో యాజమాన్యం, ఢిల్లీకి చెందిన డిజైన్ ఇంజనీరింగ్ కంపెనీకి కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణ అంచనాలను అనుమతులు లభించాయని సీఈలకు నాయకులు వివరించారు. వీలైనంత తొందరగా సర్వే చేసి ఢిల్లీ సర్వే కంపెనీకి, బోర్డుకు సర్వే నివేదికను పంపించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక



సంఘంలో చేరిన వారితో నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో మంగళవారం కె.సత్యనారాయణ అధ్యక్షతన ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు సమక్షంలో పలువురు కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరారు. వారికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇల్లెందు భవిష్యత్ కోసం అన్ని ప్రయత్నాలు చేస్తూ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సెక్రటరీ ఆఫ్ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో కాంగ్రెస్ అధిష్టానాన్ని కదిలించి పూసపల్లి ప్రాజెక్టుకు అనుమతులు తీసుకొస్తే స్వాగతించాల్సిన గుర్తింపు సంఘం అమాయక గిరిజన ప్రజలతో ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టించి ఇల్లెందు ఏరియాను అగమ్యగోచరంగా చేశారని విమర్శించారు.

ఇప్పటికైనా కార్మిక సంక్షేమ కోసం కార్మిక వ్యతిరేక విధానాలను విడిచిపెట్టి ఇల్లెందు ఏరియాను కాపాడుకోవటం కోసం కలిసి పనిచేయాలని సూచించారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ పూర్తిగా విఫలమైందన్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు వారి ఆత్మ గౌరవం కోసం లాభాల వాటా నుంచి ప్రతీ కార్మికుడికి రూ.5500 ఇప్పించిన ఘనత ఐఎన్‌టీయూసీదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రానున్న కాలంలో కొన్ని కొత్త బావులు తెరవబోతున్నామని స్పష్టం చేశారు. కేటీసీలో యూనియన్ బలోపేతానికి, యూనియన్‌లో చేరికలకు నిరంతరం కృషి చేస్తున్న డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్యా నాగేశ్వరరావు, పిట్ సెక్రటరీ కె.సత్యనారాయణ, కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ముచ్చా సుధాకర్‌లను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. చీఫ్ ఆర్గనైజషన్ సెక్రటరీ అజ్మీరా ఉపేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు, సేఫ్టీ కమిటీ, బ్రాంచ్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రేడ్‌మెన్‌లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పీవీకే – 5 ఇంక్‌లైన్ అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తున్న అర్హత కలిగిన ట్రేడ్స్‌మెన్‌లు (ఫిట్టర్, ఎలక్ట్రీషన్స్), సర్వేస్‌లలోని డిపార్ట్‌మెంట్లలో పనిచేయుటకు మంగళవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఫిట్టర్ 10, ఎలక్ట్రీషన్ 16 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ కే.సూర్యనారాయణ రాజు, డీజీఎం జీవీ మోహన్‌రావు, డీజీఎం ఐఈడీ ఎన్.యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎకో బజార్

పాల్వంచరూరల్: పర్యావరణానికి హాని చేయని మట్టి దీపాలు, కుమ్మరి ఉత్పత్తులు, వెదురు వస్తువులు, కాగితంతో తయారు చేసిన ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బుధవారం లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎకో బజారు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ వస్తువులు, ఆవు పిడకలు, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు, వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

వాటర్ ప్యూరిఫైర్ వితరణ

ఇల్లెందు: ఇల్లెందు శాఖ గ్రంథాలయానికి కొత్తగూడేనికి చెందిన కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి వాటర్ ప్యూరిఫైర్ వితరణగా అందజేశారు. మంగళవారం గ్రంథాలయ కమిటీ చైర్మన్ వీరబాబు ఆహ్వానం మేరకు గ్రంథాలయానికి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు సర్వసతీ నిలయాలు అన్నారు. కష్టపడి చదువుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు రుక్మిణీ, ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లానాయక్, యూత్ లీడర్ సన్నీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలతో సూపర్‌వైజర్ ఉమాదేవి

కొత్తగూడెంటౌన్: పోషకాహారం తీసుకుంటే తల్లీపిల్లలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సెక్టార్ సూపర్‌వైజర్ ఉమాదేవి అన్నారు. మంగళవారం కొత్తగూడెం అర్బన్, పాత కొత్తగూడెం బూడిదగడ్డ సెక్టార్లలోని పోషకాహారం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఉమాదేవి పాల్గొని తల్లులు, పిల్లలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

మునగ, బచ్చలి, గోంగుర, తోటకూర, తీసుకోవాలని అంతేకాకుండా మిల్లెట్స్, ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ప్రతీనెల పిల్లల ఎత్తు, బరువు చూపించి వారు ఏ గ్రేడ్‌లో ఉన్నారని తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలను జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్ జి.గోనెమణి, టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయించండి..



హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జూలూరుపాడు: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు మర్యాద పూర్వకంగా కలిసి బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 30 వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరికి ప్రభుత్వం రూ.180 కోట్ల ఫీజు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులను దసరా సెలవులు తరువాత యజమాన్యాలు పాఠశాలకు అనుమతించడం లేదని, ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించే విధంగా కృషి చేయాలని కోరారు.

ఆదరణ లేని అర్బన్ పార్క్

- కోట్లు ఖర్చు చేశారు.. ఫలితం దక్కేనా?
- ఫారెస్ట్ అర్బన్ పార్క్‌కు రాని సందర్శకులు



అర్బన్ పార్క్ ముఖద్వారం

పాల్వంచరూరల్: ఫారెస్ట్ అర్బన్ పార్క్ ఏర్పాటు కోసం రూ.కోట్ల వ్యయం చేసినా సందర్శకులు రావడం లేదు. దీంతో ప్రభుత్వం ఆశించిన ఫలితం శూన్యం. ఇటు పట్టణ, అటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మధ్యలో ఫారెస్ట్ అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. మండల పరిధి బస్వతారక కాలనీ పంచాయతీ సోములగూడెం వైపు వెళ్లే మార్గంలో 108 ఎకరాల విస్తీర్ణంలో అర్బన్ పార్క్ (నందనవనం) ఫారెస్ట్ శాఖ అధికారులు నిర్మాణం చేశారు. కాంపెన్‌సేటరీ ఎఫర్‌స్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ(కాంపా) పథకం కింద 2022లో రూ.కోటి నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో మూడేళ్లుగా పార్క్ నిర్మాణ పనులు చేస్తున్నారు.

గోడలపై వన్యప్రాణుల చిత్రాలు..

పార్క్ వద్దకు సందర్శకులు వెళ్లగానే అకర్షించేలా, అభయారణ్యం సంచరించిన అనుభూతి కలిగేలా వివిధ రకాల జంతువుల బొమ్మలను పార్క్‌కు రెండువైపులా గోడలకు వేశారు. పార్క్ చుట్టూ ఆరు కిలోమీటర్ల పొడువున ఇనుప కంచె ఏర్పాటు చేశారు. లోపల ప్రకృతి అందాల నడుమ వాకర్స్ కోసం మూడు కిలోమీటర్లు ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. చిన్నారులను అకర్షించేలా జారుడు బల్లలు, రంగులరాట్నం తదితర ఆట వస్తువులను అమర్చారు. యువతీ, యువకుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. పార్కులోని ప్రకృతి అందాలను వీక్షించేలా ఎత్తైన మూడు టవర్లను నిర్మించారు. ఆక్యుప్రెజర్ ట్రాక్ నిర్మాణంతో పాటు రాక్ ఫిల్ డ్యామ్‌లను కూడా ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం, హరిత నిధి రూ.18లక్షల వ్యయంతో ఖాళీ ప్రదేశాల్లో, ఆకర్షణీయమైన వివిధ రకాల మొక్కలను పెంచారు. అదేవిధంగా నీడనిచ్చేందుకు ట్రాక్ పొడువునా వెదురు, టేకు, ఎర్రచందనం, శ్రీగంధం మొక్కలు నాటారు.

ప్రచారం లేదు..

ఇక్కడ అర్బన్ పార్క్ ఉన్నట్లు ప్రస్తుతం బస్వతారక కాలనీ, సోములగూడెం, బిక్కుతండా వాసులకు తప్ప పట్టణ ప్రజలకు తెలియదు. ఇందుకు అర్బన్ పార్క్ ఉందని ప్రచారానికి బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్, కిన్నెరసాని రోడ్డు, బీసీఎం రహదారిపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి.



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు

ప్రచారం చేయాలి..



సోములగూడెం రోడ్డులో అటవీశాఖ నిర్మాణం చేసిన అర్బన్ పార్క్ ప్రకృతి సిద్ధంగా బాగుంది. పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు, యువకుల కోసం జిమ్ ఏర్పాటు చేశారు. కానీ ప్రచారం లేకపోవడంతో ఎవరూ రావడం లేదు.

– వందరోజుల శ్రీనివాస్, బస్వతారక కాలనీ

రెండు గేట్లు ఏర్పాటు చేయాలి..



అర్బన్ పార్క్ బావుంది. కానీ లోపలికి వెళ్లేందుకు రెండు, మూడుదారులు ఏర్పాటు చేయాలి, కేటీపీఎస్ గేటు ఎదుట నుంచి గతంలో పార్క్ వరకు వాహనాలు రాకపోకలు సాగించేవి. ఇప్పుడు ఒక్క గేటు మాత్రమే ఏర్పాటు చేశారు.

– జగదీష్‌కుమార్, పాండురంగాపురం తండా

సుందరంగా తీర్చి దిద్దుతున్నాం..



అర్బన్ పార్క్‌ను ఇంకా సుందరంగా తీర్చిదిద్దేందుకు బడ్జెట్ కావాలి. పట్టణ ప్రజలు సందర్శించేందుకు వీలుగా కలప డిపో నుంచి పార్క్‌లోకి నేరుగా రోడ్డు నిర్మించాలి. కార్తీకవనాన్ని పునరుద్ధరించాలని ప్రతిపాదనలు ఉన్నాయి.

– కట్టా దామోదర్‌రెడ్డి, ఎఫ్‌డీఓ, పాల్వంచ

మోడల్ గ్రామంలో 'ఇందిరమ్మ' ముందడుగు



పూబెల్లిలో ఇందిరమ్మ ఇంటిని ఆన్‌లైన్ చేస్తున్న కార్యదర్శి బాలకృష్ణ

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: ఆరు నెలలుగా బిల్లులు మంజూరు లేక.. నిర్మాణాలు ముందుకు సాగక.. గుడిసెలలో జీవనం సాగిస్తూ ఇబ్బంది పడిన ఆదివాసీలకు ఊరట లభించింది. ఇన్నాళ్లు బిల్లుల మంజూరు కోసం ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు అవరోధంగా మారాయి. సమస్యపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులు స్పందించడంతో ఆరు నెలల నిరీక్షణ తరువాత సమస్యకు పరిష్కారం లభించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని పూబెల్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసి గ్రామంలోని 83 మందికి ఇళ్లు మంజూరు చేశారు. పథకానికి మార్చి 16వ తేదీన రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఇళ్లు మంజూరైన ఆదివాసీలు నిర్మాణాలను వెంటనే ప్రారంభించారు. బేస్‌మెంట్ వరకు పూర్తి చేసుకున్న 34 ఇళ్లకు ఏప్రిల్‌లో రూ.లక్ష చొప్పున బిల్లులు మంజూరయ్యాయి. ప్రభుత్వ సాయానికి సంబురపడిపోయిన లబ్ధిదారులు అంతే వేగంగా ఇళ్ల నిర్మాణం కొనసాగించారు. 23 ఇళ్లు స్లాబ్ లెవల్‌కు చేరుచేరుకోగా 12 ఇళ్లకు స్లాబ్ కూడా పూర్తి చేశారు. ఇక ఇప్పుడు బిల్లుల మంజూరు కోసం సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఏప్రిల్ తరువాత బిల్లుల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. వ్యవసాయ సీజన్ కావడంతో ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు భారంగా మారగా పెట్టుబడికి మరింత అప్పు చేసిన ఆదివాసీలు ఇళ్ల పథకం పేరుతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. బిల్లుల మంజూరు లేక ఇళ్ల నిర్మాణాలను పూర్తిగా నిలిపివేశారు. సమస్యపై 'ఎదురు చూపులు ఇంకెన్నాళ్లు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు స్పందించారు. స్లాబ్ లెవల్ చేరుకున్న ఇళ్లు, స్లాబ్ లెవల్ పూర్తయిన ఇళ్ల వివరాలు నమోదు చేసి తమకు పంపాలని పూబెల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. స్లాబ్ లెవల్‌కు చేరుకున్న 23 ఇళ్లు, స్లాబ్ పూర్తయిన 12 ఇళ్ల ఫొటోలను అక్టోబర్ 10న ఉన్నతాధికారులకు పంపారు. పరిశీలించిన ఉన్నతాధికారులు సాంకేతిక సమస్యను సరిచేసి బిల్లుల మంజూరుకు లైన్ క్లియర్ చేస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ గ్రామంలోని 26 ఇళ్ల ఫొటోలను నిర్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అప్‌లోడ్ చేశారు. మరో తొమ్మిది ఇళ్లను బుధవారం ఆన్‌లైన్ చేస్తామని కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. దీంతో స్లాబ్ లెవల్ వరకు పూర్తన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.3లక్షలు, స్లాబ్‌లెవల్ వరకు చేరుకున్న ఇళ్లకు రూ.లక్ష చొప్పున పది రోజుల్లో బిల్లులు జమ కానున్నాయి. దీంతో పూబెల్లి గ్రామ ఇళ్ల పథకం లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.